క్లుప్తంగా

ప్రతి ఓటరుకు ఆధార్ అనుసంధానం చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రాజు

వేములవాడఅర్బన్: ప్రతి ఓటరుకు ఆధార్ అనుసంధానం చేయాలని వేములవాడ తహసీల్దార్ రాజు అన్నారు. వేములవాడ తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం బీఎల్ఓల తో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేరే ప్రాంతానికి వెళ్లిన వారు, మృతి చెందిన వ్యక్తులకు సంబంధించిన వివరాలు అందుబాటులో లేకపోయినా వాటిని తొలగించాలన్నారు. పకడ్బందీగా ప్రక్రియను నిర్వహించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ శ్రావణ్, డిప్యూటీ తహసీల్దార్ రజిత, ఆర్ఐలు సతీశ్, అమరేందర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సుమలత, బీఎల్వోలు పాల్గొన్నారు.

స్వచ్ఛతలో ముందడుగు



మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరమణారెడ్డి

ఇల్లంతకుంట: మండలంలోని జంగంరెడ్డిపల్లి స్వచ్ఛత, అభివృద్ధిలో ముందుకు దూసుకుపోతోందని ఎంపీపీ వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని జంగంరెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం స్వచ్ఛభారత్‌పై శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. జిల్లాలో జాతీయ అవార్డు కోసం జంగంరెడ్డిపల్లిని ఎంచుకున్నట్లు తెలిపారు. గ్రామంలో 29 అంశాలపై వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది 8 బృందాలుగా విడిపోయి ఒక్కో జట్టులో 25 మంది సిబ్బందితో సర్వే చేసినట్లు తెలిపారు. జిల్లాలో మూడు గ్రామాలను ఎంపిక చేశారని, వాటిలో ప్లాస్టిక్ నివారణ, పారిశుద్ధ్యంతో పాటుగా వివిధ అంశాలలో జంగంరెడ్డిపల్లి ముందుందన్నారు. స్వచ్ఛభారత్ జిల్లా కోఆర్డినేటర్ సురేశ్, ఎంపీడీవో మీర్జా, చందుర్తి ఎంపీడీవో ప్రదీప్‌కుమార్, ఎంఈవో బన్నాజీ, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చల్ల నారాయణ పాల్గొన్నారు.

ర్యాగింగ్‌ను నియంత్రించాలి



మాట్లాడుతున్న మధూకర్

వీర్నపల్లి: విద్యా సంస్థల్లో ర్యాగింగ్‌ను నియంత్రించాలని బీఎస్పీ జిల్లా కార్యదర్శి మధూకర్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థుల్లో నెలకొన్న భయాందోళనలను దూరం చేయాలన్నారు. బహుజన వర్గాలను పాలకవర్గాలు ఓట్లేసే యంత్రాలుగానే చూస్తున్నాయని అన్నారు. మండల బీఎస్పీ అధ్యక్షుడు జింక నాగరాజు, ప్రధాన కార్యదర్శి గజ్జెల ప్రశాంత్ పాల్గొన్నారు.

సమస్యలతో సావాసం

- ఓట్లప్పుడేనా గుర్తింపు
- కాలనీవాసుల కష్టాలు పట్టవా.?
- పట్టించుకోని అధికారులు

"ఈ ఫొటోలో కనబడుతున్న గుడిసెలను చూస్తే ఇవి ఎక్కడో మారుమూల ప్రాంతాలకు చెందినవని అనుకుంటాం. కాని వేములవాడ రాజన్న గుడికి సమీపంలో ఉన్న మూడో వార్డులో ఎన్నో ఏళ్లుగా జీవనం సాగిస్తున్న వారి కాలనీ. పుణ్యక్షేత్రంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి వైపు వడివడిగా అడుగులు వేస్తుంటే, ఈ కాలనీలో మాత్రం ఆ ఛాయలు కనిపించడం లేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది. మౌలిక సౌకర్యాలు కూడా లేని ఈ కాలనీలో ప్రజలు ఎలా జీవిస్తున్నారో.. ఆ రాజన్నకే తెలుసు.."



వేములవాడరూరల్: "రాజన్న సన్నిధిలో బతుకుతున్నం అనే సంతోషం తప్ప, సమస్యలతో సావాసం చేస్తున్నాం." ఇది వేములవాడ పట్టణంలో 3వ వార్డులో ప్రజల మనోగతం. తాము నివసిస్తున్న కాలనీ గురించి పాలకులు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజన్న మెట్ల వద్ద భిక్షాటన చేస్తూ కుటుంబాలను పోషించుకునే వీరు ప్రస్తుతం కూలి పని చేసుకుంటూ ఎలాగోలా జీవితాలను వెల్లదీస్తున్నారు. పెద్దమ్మల సామాజికవర్గానికి చెందిన వీరు ఏళ్లుగా ఎదుగుబొదుగు లేని జీవనాన్ని సాగిస్తునే ఉన్నారు.

పాతికేళ్లుగా ఇదే పరిస్థితి

రాజన్న ఆలయానికి సమీపంలో దాదాపు 25 ఏళ్ల నుంచి ఈ కాలనీలో వీరు నివసిస్తున్నారు. లక్ష్మీపురం ప్రాంతంగా పిలువబడే ఈ కాలనీలో ఉంటున్న వీరికి డ్రెయినేజీ, నీటి సౌకర్యం, రోడ్లు లేక ఇబ్బంది పడుతున్నారు. ఎన్నికల సమయంలో ఓట్లు అడిగేందుకు ఈ ప్రాంతానికి నాయకులు ఎన్నో హామీలు ఇస్తునే ఉన్నారు. కాని ఆ తర్వాత కాలనీ వైపు కన్నెత్తి చూడడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ కాలనీ సమస్యలపై అధికారులకు విన్నవించుకున్నా హామీలే తప్ప అమలు చేసిన దాఖలాలు లేవని వారు అంటున్నారు. రాజన్న ఆలయానికి కూతవేటు దూరంలో ఉంటున్న ఈ కాలనీ చూస్తే వీరు పట్టణంలోనే ఉంటున్నారా అనే అనుమానం ఎవరికైనా కలుగుతుంది. అలాంటి కాలనీలో ఉంటున్న వీరు ఎప్పటికైనా తమపై పాలకులు, అధికారులు దయచూపుతారనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రధాన సమస్యలు



రోడ్డుపై పారుతున్న డ్రెయినేజీ నీరు

➡ ఇంటింటికి నల్లా నీటికి ఈ కాలనీ దూరం. మిషన్ భగీరథ పైప్ నీరు వస్తే తప్ప వీరికి ప్రత్యేకంగా నల్లా కనెక్షన్లు లేవు. ఆ నీరు రాకుంటే వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి వస్తుంది.

➡ కాలనీలో డ్రెయినేజీలు కనబడవు. ఇళ్ల మధ్య నుంచే మురుగు పారుతుంది. వర్షాకాలం పరిస్థితి మరీ దయనీయం. ఈ గుడిసెల చుట్టూ నీరు నిలిచి కంపు కొడుతుంది.

➡ ప్రత్యేకంగా కాలనీలోకి విద్యుత్ లైన్ లేకపోవడంతో దూరంగా ఉన్న మేయిన్ రోడ్డు నుంచి ఇళ్లలోకి విద్యుత్ తీగలు వేసుకున్నారు.

➡ ఏళ్లుగా గుడిసెలోనే వీరి జీవితాలు తెల్లవారుతున్నాయి. డబుల్ బెడ్రూం రూం ఇళ్లకు అసలైన అర్హులైన వీరు ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నారు. సొంత స్థలాలు ఉన్న వీరు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించుకునేందుకు నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

ఎన్నికలప్పుడే గుర్తొస్తాం



మా గుడిసెలు నాయకులకు ఎన్నికలప్పుడే గుర్తొస్తాయి. తదుపరి మా గురించి పట్టించుకునే అధికారి, నాయకులు లేరు. మా కాలనీలో కనీస సౌకర్యాలు లేక రోజూ ఇబ్బందులు పడతాం.

– కె.సమవ్వ, లక్ష్మీపురం, 3వ వార్డు, వేములవాడ

ఎన్నిసార్లు చెప్పినా అంతే



మా సమస్యల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎండాకాలంలోనే ఇలాంటి పరిస్థితి ఉంటే ఇక వర్షాకాలంలో మా కష్టాలు చెప్పనక్కర్లేదు. అధికారులు మమ్ములను కూడా గుర్తించాలి.

– రాజయ్య, లక్ష్మీపురం, 3వ వార్డు, వేములవాడ

ప్రతిపాదనల్లో అన్ని వార్డులు



పట్టణ అభివృద్ధికి రూ. 5 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు పంపించాం. అన్ని వార్డుల్లో మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళిక తయారు చేశాం. అనుమతులు రాగానే పనులు జరుగుతాయి.

– అన్వేశ్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ

సమాచారం

17న పెద్దూరు సింగిల్‌విండో సమావేశం

సిరిసిల్లఅర్బన్: పెద్దూరు సింగిల్‌విండో కార్యవర్గ సమావేశాన్ని ఈనెల 17న నిర్వహిస్తున్నట్లు డీసీవో బుద్దనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. చైర్మన్ బర్కం వెంకటలక్ష్మిపై వచ్చిన అవిశ్వాస నోటీస్ గురించి చర్చించేందుకు, ఓటింగ్ నిర్వహించేందుకు సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. పాలకవర్గ సభ్యులందరూ సమావేశానికి హాజరుకావాలన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ లత

కోనరావుపేట: మండలం మల్కపేటలో జై హనుమాన్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ ఆరె లత శుక్రవారం ప్రారంభించారు. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

చిన్నారులకు అన్నప్రాసన



చిన్నారులకు అక్షరాభ్యాసాన్ని చేయిస్తున్న టీచర్

కోనరావుపేట: మండలం నిమ్మపల్లిలోని అంగన్‌వాడీ సెంటర్–3లో చిన్నారులకు శుక్రవారం అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్రంలో తల్లులు, గర్భిణులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి వారికి పోషకాహారం, చిన్నారుల ఆలనా పాలన గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ గూడూరి శారద, ఆయా అంజవ్వ, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రాన్ని అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

వీర్నపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద పంచాయతీ కార్మికులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల పంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షుడు లద్దూరి నర్సయ్య మాట్లాడుతూ ఆరు నెలలుగా కార్మికుల వేతనాలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. సకాలంలో వేతనాలు ఇవ్వకుంటే జిల్లా కార్మికులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎంపీడీవో నరేశ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

ఎమ్మార్సీని సందర్శించిన డీఈవో



డీఈవోను సన్మానిస్తున్న ఎంఈవో

బోయినపల్లి: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనాన్ని డీఈవో రమేశ్‌కుమార్ శుక్రవారం సందర్శించి పలు రికార్డులు పరిశీలించారు. తొలిసారి కార్యాలయానికి వచ్చిన డీఈవోను ఎంఈవో శ్రీనివాసదీక్షితులు, ఎమ్మార్సీ సిబ్బంది సన్మానించారు. అనంతరం మాన్వాడ ప్రైమరీ స్కూల్‌లో టాయిలెట్ల నిర్మాణానికి డీఈవో భూమిపూజ చేశారు.

కొనసాగుతున్న నిరసనలు

- ప్రధాని దిష్టిబొమ్మ దహనం
- ఖాళీ సిలిండర్లతో బైఠాయింపు
- రోడ్డుపై వంటావార్పు



వేములవాడలో వంటావార్పు చేస్తూ..



చందుర్తి: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

వేములవాడ/వేములవాడఅర్బన్/రుద్రంగి/చందుర్తి/కోనరావుపేట: గ్యాస్ సిలిండర్ ధర పెంచినందుకు నిరసనగా జిల్లా వ్యాప్తంగా పలు మండల కేంద్రాల్లో శుక్రవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. రోడ్లపై కట్టెల పొయ్యిపై వంటావార్పు నిర్వహించారు. ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి, ఖాళీ సిలిండర్లతో రోడ్డుపై బైఠాయించారు. వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, ఎంపీపీలు గంగం స్వరూపారాణి, బైరగోని లావణ్య, బూర వజ్రమ్మ, జెడ్పీటీసీలు గట్ల మీనయ్య, మ్యాకల రవి పార్టీ మండల అధ్యక్షులు దెగావత్ తిరుపతి, మ్యాకల ఎల్లయ్య, మల్యాల దేవయ్య, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, పొన్నాల శ్రీనివాస్‌రావు, హరిచరణ్‌రావు, సింగిల్‌విండో, ఏఎంసీ చైర్మన్లు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

ముస్తాబాద్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన వార్షికోత్సవ సభలో విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జెడ్పీటీసీ గుండం నర్సయ్య మాట్లాడుతూ ఇంటర్ విద్య విద్యార్థులకు ఎంతో కీలకమని అన్నారు. కళాశాలలో చేరిన తరువాత కొత్త ప్రపంచం కనిపిస్తుందని, ఆకర్షణలకు లోనుకాకుండా ఉన్నత లక్ష్యంతో ఎదగాలన్నారు. చెడు సావాసాలతో జీవితాలను కొల్పోరాదన్నారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, సర్పంచ్ గాంఢ్ల సుమతి, ఎస్సై వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ దేవయ్య, జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు సర్వర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ రవాణాపై అంకుశం

- డంపులు సీజ్
- ట్రాక్టర్లు సీజ్, కేసులు నమోదు
- వాగుల్లోకి వెళ్లకుండా కందకాలు

తంగళ్లపల్లి: ఇసుక రవాణా అక్రమార్కులకు కాసుల పంట కురిపిస్తోంది. ఒక్కో ఇసుక ట్రాక్టర్ ట్రిప్పుకు రూ.1500 నుంచి రూ.2 వేల వరకు ధర పలుకుతుండడంతో అక్రమార్కులు అడ్డదారులు తొక్కుతున్నారు. ఇంటి నిర్మాణాలు, ప్రభుత్వ పనులకు రెవెన్యూ అధికారులు వారానికి రెండుసార్లు ఇసుక రవాణాకు వే బిల్లులు ఇస్తున్నారు. కానీ ఇసుక డిమాండ్ ఎక్కువగా ఉండడంతో ఎంత వీలైతే అంత తరలించి జేబులు నింపుకోవాలని కేటుగాళ్లు కొత్త దారులు వెతుకుతున్నారు. అధికారులు, పోలీసుల కనుగప్పి రాత్రిళ్లు ఇసుక రవాణా చేస్తున్నారు. వారికంటే పోలీసులు ఒక అడుగు ముందుంటూ ఎక్కడికక్కడ ఇసుక డంపులు సీజ్ చేస్తూ అక్రమార్కులకు చుక్కలు చూపిస్తున్నారు.

మూసుకుపోయిన దారులు

మండలంలో తంగళ్లపల్లి, మండెపల్లి, కస్బేకట్కూర్, గండిలచ్చపేట గ్రామ శివారుల నుంచి అక్రమ రవాణా రాత్రిళ్లు యథేచ్ఛగా జరిగేది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు పోలీసులు తీసుకున్న చర్యలతో అక్రమ రవాణాకు దారులు మూసుకుపోయాయి. వాగులోకి ట్రాక్టర్లు వెళ్లకుండా కందకాలు తవ్వించారు. రాత్రిళ్లు పెట్రోలింగ్ నిర్వహిస్తూ నదీ పరివాహక ప్రాంతంపై ప్రత్యేక దృష్టి పెట్టారు.



ఇసుక డంపును సీజ్ చేస్తున్న పోలీసులు(ఫైల్)

నెలలో 25 కేసులు

కేవలం నెల రోజుల వ్యవధిలో సుమారు 25 వరకు కేసులు నమోదయ్యాయంటేనే అక్రమ రవాణా అరికట్టేందుకు పోలీసులు ఎంత పట్టుదలతో ఉన్నారో కనిపిస్తోంది. అలాగే ఇసుక డంపులపై కూడా పోలీసులు నజర్ పెట్టారు. పద్మనగర్ శివారు నాగుల ఎల్లమ్మ గుడి వద్ద 10 ట్రిప్పులు, ఓబులాపూర్ శివారులో 7 ట్రిప్పులు, మరికొన్ని గ్రామాల్లో ఇసుక డంపులు సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించారు.

వే బిల్లులు ఇస్తున్నాం



స్థానికంగా ఇంటి నిర్మాణాలకు ఇసుక కొరత లేకుండా వారానికి రెండుసార్లు వేబిల్లులు ఇస్తున్నాం. ఇంటి నిర్మాణాలు, ప్రభుత్వ పనులకు సహకరిస్తాం. ఇతర ప్రాంతాలకు ఇసుకను తరలిస్తే మాత్రం చర్యలు తీసుకుంటాం.

– పి.సదానందం, తహసీల్దార్ తంగళ్లపల్లి

కేసులు నమోదు చేస్తాం



అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఇప్పటికే అక్రమ రవాణాను అడ్డుకున్నాం. తంగళ్లపల్లితోపాటు శివారు గ్రామాల్లో అక్రమ రవాణా ఆగిపోయింది. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– పి.లక్ష్మారెడ్డి, ఎస్సై, తంగళ్లపల్లి

మెరుగైన వైద్యం అందించేందుకు కృషి



సుభాష్‌ను పరామర్శిస్తున్న ఆగయ్య

ఎల్లారెడ్డిపేట: ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలకు మెరుగైన వైద్యం అందించే విధంగా కృషి చేస్తామని పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకటాపూర్ యూత్ అధ్యక్షుడు మెడిశెట్టి మల్లేశ్, రాచర్ల తిమ్మాపూర్‌కు చెందిన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అందె సుభాష్‌ను శుక్రవారం ఆయన పరామర్శించారు. పార్టీ బలోపేతం కోసం అహర్నిషలు కృషి చేసిన కార్యకర్తలు, నాయకులు ఇతర ఆపద సమయాల్లో వారికి పార్టీ అండగా ఉంటుందన్నారు. ఆయనతో పాటు జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ వరస కృష్ణహరి, నాయకులు ఉన్నారు.

బీమా చెక్కు అందజేత



చెక్కును అందిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్ పరిధి గాజులపల్లిలో కార్యకర్త మెడిశెట్టి మల్లయ్య భార్య నర్సవ్వకు శుక్రవారం పార్టీ తరుపున మంజూరైన రూ.2 లక్షల చెక్కును జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు వర్ష కృష్ణహరి అందజేశారు. మల్లయ్య ఏడాది క్రితం విద్యుత్ షాకుతో మరణించాడు. కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి రేణుక, ఎంపీటీసీ మామిండ్ల తిరుపతి బాబు, సర్పంచ్ కొల అంజమ్మ, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆలయ అభివృద్ధికి విరాళం

తంగళ్లపల్లి: మండలంలోని అంకుషాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన చౌడాలమ్మ ఆలయ అభివృద్ధికి ఎంపీటీసీ కోడి అంతయ్య రూ.10 వేలు, రెడ్డి సంఘం మండల అధ్యక్షుడు ఎసిరెడ్డి రాంరెడ్డి రూ.5 వేల విరాళం శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కుంటయ్య, సింగిల్‌విండో అధ్యక్షుడు బండి దేవదాస్, ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, జాగృతి అధ్యక్షుడు కందుకూరి రామాగౌడ్, మాజీ సర్పంచ్ భాస్కర్ పాల్గొన్నారు.

సాగునీరందించాలి

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో ఎగువ మానేరు ప్రాజెక్టు రైతులందరికీ సాగునీరందించాలని రైతులు ఇరిగేషన్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ 15, 16, 17లకు అసలు నీరందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీని కింద సాగు చేస్తున్న పొలాలు ఎండిపోయే దశకు చేరుకున్నాయన్నారు. బోర్లతోనే కొంతమంది రైతులు వరి సాగు చేస్తున్నారని, కెనాల్‌పై ఆధారపడ్డ వారు ఆందోళన చెందుతున్నారని డీఈ నర్సింగ్ దృష్టికి తీసుకెళ్లారు.

నట్టల నివారణ మందు పంపిణీ

తంగళ్లపల్లి: మండలంలోని పాపయ్యపల్లె గ్రామపంచాయతీ పరిధిలో శుక్రవారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ సర్పంచ్ నక్క రేవతి ప్రారంభించారు.

వీర్నపల్లి: మండల కేంద్రంలో పశువైద్యాధికారిణి రేణుక ఆధ్వర్యంలో నట్టల నివారణ మందులను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దినాకర్, ఎంపీటీసీ అరుణ్ కుమార్, సెస్ డైరెక్టర్ మల్లేశం, గడ్డం దేవయ్య, రైతులు పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల

ఇల్లంతకుంట: మండలంలోని రహీంఖాన్‌పేట మోడల్ స్కూల్‌లో రాష్ట్రీయ ఆవిష్కార్ వారోత్సవాల పోస్టర్‌ను శుక్రవారం పాఠశాల విద్యార్థులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 6 నుంచి 12వ తరగతి విద్యార్థులు వివిధ మట్టి నమూనాలు సేకరించి ప్రయోగశాలలో విశ్లేషించి నేల స్వభావం, సాంద్రత, నీటిని నిలుపుకునే సామర్థ్యం వంటి అంశాలను విస్తరిస్తారని ప్రిన్సిపల్ మధుకర్ తెలిపారు. ఉపాధ్యాయులు మురళీకృష్ణ, వెంకన్న, విజయ్‌కుమార్, నర్సయ్య, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని హరిదాస్‌నగర్ గ్రామంలో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఫ్ చెక్కులను ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు శుక్రవారం పంపిణీ చేశారు. సర్పంచ్ అమృత, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ వర్ష కృష్ణహరి, ఎంపీటీసీ మల్లేశం పట్టణ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, కార్యదర్శి సంపత్ పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థికసాయం

వేములవాడరూరల్: వేములవాడ మండల కేంద్రంలోని భవిత సెంటర్‌లో విద్యనభ్యసిస్తున్న అంధ విద్యార్థి జి.పల్లవి సర్జరీ కోసం ఉపాధ్యాయురాలు సుహాసిని రూ.5 వేలు, భవిత కేంద్రం నిర్వాహకురాలు కె.జయలక్ష్మి రూ.5 వేలు విద్యార్థిని తల్లిదండ్రులకు అందజేశారు.

మోడల్ స్కూల్‌లో స్టడీ స్కిల్స్‌పై శిక్షణ

బోయినపల్లి: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో శుక్రవారం జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టడీ స్కిల్స్‌పై మాస్టర్ ట్రైనర్ పద్మనాభస్వామి రెండో విడత శిక్షణ ఇచ్చారు. ప్రతీ విద్యార్థి పరీక్షలు ధైర్యంగా రాయాలని, చేతిరాతలో నైపుణ్యత పెంచుకోవాలని సూచించారు.

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి

ముస్తాబాద్: ప్రభుత్వం అందిస్తున్న స్వయం సహాయక రుణాలతో మహిళలు స్వయం ఉపాధి పొందాలని సర్పంచ్ గాండ్ల సుమతి అన్నారు. ముస్తాబాద్‌లో ఐకేపీ మహిళలు ఏర్పాటు చేసిన పిండి గిర్నిని ఆమె శుక్రవారం ప్రారంభించారు. ఐకేపీలో రుణాలు తీసుకున్న మహిళలు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీఎం జయసుధ, కోఆప్షన్ సభ్యుడు షాదుల్, సీసీలు రాజ్యలక్ష్మి, శోభన్, లక్ష్మణ్, రేణుక, వనజ పాల్గొన్నారు.